క్లుప్తంగా

జాబ్ మేళా సద్వినియోగం చేసుకోండి

కనిగిరి రూరల్: జాబ్ మేళాలన నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్ మేళా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో చైర్మన్ అబ్దుల్ గఫార్, ఆర్డీఓ పాలపర్తి జాన్ఇర్వీన్, డీఈఓ టీ భరద్వాజ్, జిల్లా నైపుణ్యాభి సంస్థ అధికారి జె. రవి తేజా, రజనీకాంత్, ప్రిన్సిపాల్ ఉషారాణి పాల్గొన్నారు. 48 మంది షార్ట్ లిస్ట్ అయినట్లు అధికారులు వెల్లడించారు. మాజీ ఎంపీపీ నంబుల వెంకటేశ్వర్లు, రాచమల్ల శ్రీనివాసుల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెలుగు ఏపీఎంగా కోటేశ్వరరావు

మద్దిపూడి: మండల వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ గా లక్కెనబోయిన కోటేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. కోటేశ్వరరావు చీమకుర్తి మండల ఎంపీఎం గా విధులు నిర్వహిస్తూ బదిలీపై మద్దిపూడి వచ్చారు. గతంలో మద్దిపూడి మండలంలో పనిచేసిన టి. రాంబాబు సంతనూతలపాడు మండలానికి వెళ్లారు. వీరితోపాటు దారా లీలకళ్యాణి, వి. ఎజ్రా, జి. రామయ్యలు నూతన సీసీలు బాధ్యతలు చేపట్టారు.

టంగుటూరులో ఆక్రమణల తొలగింపు


టంగుటూరులో ఆక్రమణలు తొలగిస్తున్న జేసీబీ

టంగుటూరు: స్థానిక ఆర్అండ్బీ రోడ్డులో ఆక్రమణల తొలగింపు ప్రక్రియ శుక్రవారం మొదలైంది. ఆర్అండ్బీ, పంచాయతీ అధికారులు ఆక్రమణదారులకు, డివైడర్ ఉన్న దుకాణదారులకు మైకు ద్వారా కాన్వాస్ చేశారు. మరి కొందరు తొలగించక పోవడంతో జేసీబీ సహాయంతో మార్కింగ్ వేసిన వరకు తొలగించారు.

అంగన్వాడీలు పౌష్టికాహార నిధి కేంద్రాలు


చింతలపాలెంలో మాట్లాడుతున్న సూపర్వైజర్ గోళ్ల పద్మజ

పామూరు: అంగన్వాడీ కేంద్రాలు పౌష్టికాహార నిధి కేంద్రాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ గోళ్ల పద్మజ, తూర్పు కట్టకిందపల్లె ప్రభుత్వ ఎంపీయూపీ పాఠశాల హెచ్ఎం కనపర్తి క్రిష్ణ అన్నారు. మండలంలోని తూర్పు కట్టకిందపల్లె అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

బ్యూటీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

టంగుటూరు: ఒంగోలు లోని రూడ్ సెట్ సంస్థలో అక్టోబర్ 3వ తేదీ నుంచి 30 రోజులు పాటు మహిళలకు బ్యూటీ పార్లర్లో ఉచిత శిక్షణ ఇస్తారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు కలిగి ఉండాలి, శిక్షణ కాలంలో శిక్షణతో పాటు వసతి, భోజన సౌకర్యాలు ఉచితంగా కల్పిస్తామని తెలిపారు. వివరాల కోసం 9573363141 నంబరును సంప్రదించవచ్చు. ఈ మేరకు సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్రెడ్డి శుక్రవారం తెలిపారు.

వరద బాధితులకు కోటి రూపాయల సాయం

సింగరాయకొం: స్థానిక జీవీఆర్ ఆక్వా కంపెనీ యాజమాన్యం శుక్రవారం అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి వరద బాధితుల సహాయార్థం కోటి రూపాయలు అందజేశారు. కంపెనీ ప్రతినిధులు గ్రంధి బాలాజీ, గ్రంధి చల్లారావు స్వయంగా చంద్రబాబుకు కోటి రూపాయల చెక్కును అందించారు.

పొగాకు కనిష్ట ధర రూ. 190

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం జరిగిన వేలంలో పొగాకు కనిష్ట ధర రూ. 190 పలికింది. మొత్తం 45 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

పడిపోయిన లో గ్రేడ్ పొగాకు ధర

కొండపి (సింగరాయకొండ): స్థానిక పొగాకు వేలం కేంద్రంలో లో గ్రేడ్ పొగాకు ధర ఒక్క రోజులోని 10 రూపాయల మేర తగ్గింది. గత 20 రోజుల్లో 40 రూపాయలు మేర తగ్గింది. శుక్రవారం 900 బేళ్లు కొనుగోలయ్యాయి.

బాధితునికి రూ.10 వేల సాయం

పామూరు: మండల కేంద్రమైన పామూరుకు చెందిన దేవనపల్లి అనిల్కుమార్కు పచ్చకామెర్ల వల్ల కిడ్నీ, లివర్ దెబ్బతిని నెల్లూరు నారాయణ హాస్పిటల్ ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం అతని భార్య నాగలక్ష్మితో మాట్లాడిన సీఐ యం.భీమానాయక్ అనిల్కుమార్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఆర్థికసాయం అందించగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్సాహంగా నియోజకవర్గ స్థాయి క్రీడలు


వాలీబాల్ పోటీలు


కబడ్డీలో తలపడుతున్న బాలికలు

కనిగిరి రూరల్: క్రీడలు ఏకాగ్రత, పట్టుదల, క్రమశిక్షణ పెంపొందిస్తాయని ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. కంచర్లవారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్స్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, చెస్, యోగా, బ్యాడ్మింటన్ పోటీలను ఎమ్మెల్యే ఉగ్ర ప్రారంభించారు. క్రీడా కారులకు దాత, స్థానిక నాయకుడు పిచ్చాల శ్రీనివాసులరెడ్డి భోజన వసతి కల్పించారు. హెచ్ఎం భాస్కర్రెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ మల్లెల పిచ్చయ్య, రాచమల్ల శ్రీనివాసులరెడ్డి, పిచ్చాల శ్రీను, తమ్మినేని శ్రీనివాసుల రెడ్డి, ఎంఈఓలు యూవీ నారాయణరెడ్డి, డీవీ సుబ్బారావు, డాక్టర్ బత్తుల బాలకృష్ణా, కిషోర్ కుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

600 మంది క్రీడాకారులు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్స్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో అన్ని మండలాలకు చెందిన సుమారు 600 మంది క్రీడా కారులు పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా, బాడ్మింటన్ వివిధ విభాగాల్లో పోటీలు రసవత్తరంగా జరిగాయి. ఆయా క్రీడల్లో ప్రతిభ చూపిన క్రీడా కారులను జిల్లా క్రీడా టీంకు ఎంపిక చేయనున్నట్లు ఖోఖో సంఘ జిల్లా కార్యదర్శి, పీడీ బి. కాశీ విశ్వనాథ రెడ్డి తెలిపారు. ఆరు మండలాల వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

జిల్లా కబడ్డీ టీంకు గార్లపేట విద్యార్థుల ఎంపిక

మద్దిపూడి: సింగరాయకొండ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ సెలక్షన్ పోటీల్లో మండలంలోని గార్లపేట జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. తొమ్మిదో తరగతి చదువుతున్న దేవరపు సౌమ్యా అండర్-14 విభాగంలో, గంగిరెడ్డి పావని అండర్- 17 విభాగంలో ప్రకాశం జిల్లాకు ఎంపికయ్యారు. పీడీ తాళ్లూరి రమాదేవిని ప్రధానోపాధ్యాయులు తూగుట్ల బిక్షాల్ రెడ్డి అభినందించారు. రమాదేవి, పల్లా మురళీబాబు పాల్గొన్నారు.

సీఎస్పురం విద్యార్థులు

సీఎస్పురం (పామూరు): మండల కేంద్రమైన సీఎస్పురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కబడ్డీ, వాలీబాల్లో జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్కు ఎంపికయ్యారు. కంచర్లవారిపల్లె జెడ్పీహెచ్ఎస్లో జరిగిన నియోజకవర్గస్థాయి స్కూల్గేమ్స్లో సత్తాచాటి జిల్లా పోటీలకు ఎంపికైన విద్యార్థులను శుక్రవారం పాఠశాలలో అభినందించారు. కాగా కబడ్డీ అండ్-14 విభాగంలో బి.కుమార్, అండర్-17 విభాగంలో గౌతమ్, నితిన్, వాలీబాల్ అండర్-17 విభాగంలో విష్ణు, ఎనోష్ జిల్లా పోటీలకు ఎంపికయ్యారు. వీరికి పాఠశాల హెచ్ఎం షేక్.ఖాదరున్నీసా బేగం, పీఈటీ వంశీకృష్ణ అభినందనలు తెలిపారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

టంగుటూరు: నియోజకవర్గ స్కూల్ గేమ్స్ క్రీడా పోటీలు సింగరాయకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 25, 26 వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, చేస్ అథ్లెటిక్స్ పోటీల్లో ఆలకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలు 9 మంది, బాలురు 8 మంది పాల్గొని ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రాధానోపాధ్యాయుడు వాకా వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. పీడీ వెంకట్రావు, విద్యార్థులను గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి. శ్రీధర్బాబు, భూషణరెడ్డి, జ్యోతి, విజయలక్ష్మి, సుభాషిణి పాల్గొన్నారు.


క్రీడలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి


జిల్లాస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలకు ఎంపికైన సీఎస్పురం జెడ్పీహెచ్ విద్యార్థులు


టంగుటూరు: పోటీలకు ఎంపికైన ఆలకూరపాడు విద్యార్థులు


ఖోఖోలో ఉత్సాహంగా..


జిల్లా కబడ్డీ టీంకు ఎంపికైన విద్యార్థులు

నేడు వైఎస్సార్ సీపీ ప్రత్యేక పూజలు

కనిగిరి రూరల్: చంద్రబాబు చేసిన పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్రెడ్డి ఆదేశాల మేరకు 28న శనివారం స్థానిక గార్లపేట రోడ్డులోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే పూజా కార్యక్రమానికి పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, అభిమానులు, పార్టీ శ్రేణులంతా హాజరు కావాలని పిలుపు నిచ్చారు. అనంతరం దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ తిరుమల పవిత్రతను, స్వామి వారి ప్రసాదం విశిష్టతను, వెంకటేశ్వర స్వామి వైభవాన్ని టీటీడీ పేరు ప్రఖ్యాతలను, స్వామి వారి ప్రసాదమైన లడ్డూ పవిత్రతను రాజకీయ దుర్బుద్ధితో చంద్రబాబు దుష్ప్రచారం చేస్తున్నాడని దుయ్యబట్టారు. జంతువుల కొవ్వుతో కల్తీ జరిగిందంటూ అసత్య ప్రచారాలకు తెరలేపాడని తీవ్రంగా మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ చేపట్టిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు.


దద్దాల నారాయణ యాదవ్

సింగరాయకొండ: కలియుగ దైవం తిరుమల వెంకటేశ్వర స్వామి మహా ప్రసాదం లడ్డూ పై అసత్య ప్రచారం చేసి ఆలయ విశిష్టతను అపవిత్రం చేశారు. ఇలాంటి చంద్రబాబు చేసిన పాపాలను ప్రక్షాళన చేసేందుకు వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్రెడ్డి ఈనెల 28వ తేదీ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరపాలని పిలుపునిచ్చారు. స్థానిక షిర్డీ సాయి మందిర్లో ఉదయం 11 గంటలకు, టంగుటూరులోని పోలేరమ్మ గుడి వద్ద సాయంత్రం 4 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు డాక్టర్ ఆదిమూలపు సురేష్ క్యాంపు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొంటారన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేయాలి

కనిగిరి రూరల్: అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజలకు సేవలందించాలని ఎంపీపీ ప్రకాశం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ ఎస్ఎల్వీ హనుమంతరావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, సర్పంచ్ బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ అడ్డరోడ్డు, పాలవరం, వంగపాడు పంచాయతీల్లో విద్యుత్ సమస్య ఉన్నట్లు తెలిపారు. పలువురు విద్యుత్ శాఖ అధికారులు అక్రమాలకు పాల్పడుతూ రైతులకు సక్రమంగా సేవలు అందించడం లేదని ఆరోపించారు. తాళ్లూరు, గుడిపాడు, బొమ్మిరెడ్డి పల్లి పంచాయతీల్లో మూడు నెలల నుంచి సాగర్ నీరు అందడం లేదని కోఆప్షన్ సభ్యుడు ఎస్కే రహీం తెలిపారు. అలాగే ప్రాదేశికాల సర్పంచ్లు, ఎంపీటీసీలు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి, వైస్ ఎంపీపీ లక్కిరెడ్డి తిరుపతిరెడ్డి, ఎంపీటీసీలు కోటమ్మ, కాసుల గురవయ్య యాదవ్, పాశం కొండయ్య, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా సమావేశానికి పలు శాఖల అధికారులు డుమ్మా కొట్టారు.


మాట్లాడుతున్న ఎంపీపీ ప్రకాశం, పక్కన జెడ్పీటీసీ కస్తూరి రెడ్డి

విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా


మాట్లాడుతున్న సీహెచ్ హరికృష్ణ

కనిగిరి రూరల్: విద్యుత్ సంస్థలో ఇటీవల జరిగిన బదిలీల్లో అక్రమాలకు నిరసనగా కనిగిరిలో శుక్రవారం స్థానిక ఈఈ కార్యాలయం వద్ద ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 1104 ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో యూనియన్ డివిజన్ కార్యదర్శి సీహెచ్ హరికృష్ణ మాట్లాడుతూ జాబితాల్లో లేని వారికి కూడా బదిలీలు చేశారని ఆరోపించారు. సబ్ స్టేషన్లు ప్రవేటు పరం చేయడానికి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం. హరిబాబు.. కనిగిరికి వచ్చిన రోజునే ప్రతిపాదనలు పంపారని ఆరోపించారు. ఈఈ నిరంకుశత్వ వైఖరిపై, అక్రమ బదిలీలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. డివిజన్ అధ్యక్షుడు ఎల్ఎస్ఎస్ అనిల్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్. శ్రీనివాసులు, ఎస్కే అబ్దుల్ కరీం, జి. కృష్ణా, జి. రమేష్ పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు సర్వే

కనిగిరి రూరల్: పట్టణంలో గత కొన్ని రోజులుగా ఆగిన ఆక్రమణ తొలగింపు సర్వే ప్రక్రియ మున్సిపాలిటీలో మళ్లీ మొదలైంది. శుక్రవారం పట్టణంలోని నాజ్ సెంటర్ నుంచి బొడ్డు చావిడి సెంటర్ వరకు టౌన్ ప్లానింగ్ అధికారి వివేకానంద ఆధ్వర్యంలో రోడ్డుకు ఇరువైపులా సచివాలయ సిబ్బంది కొలతలు నిర్వహించి మార్కింగ్ వేశారు. నాజ్ సెంటర్ నుంచి బొడ్డు చావిడి సెంటర్ వరకు సర్వే నిర్వహించినట్లు మార్కింగ్ చేశారు. దీనిపై టౌన్ ప్లానింగ్అధికారి టీ వివేకానంద మాట్లాడుతూ సుమారు 30 నుంచి 32 అడుగుల వరకు ఉండాల్సిన రోడ్డు ప్రస్తుతం చాలా చోట్ల 25 నుంచి27 అడుగుల వరకు ఉన్నట్లు తెలిపారు.


సర్వే నిర్వహిస్తున్న టీపీఓ, సచివాలయ అధికారులు

సమాచార హక్కు చట్టంపై అవగాహన


మాట్లాడుతున్న వ్యవసాయాధికారి వెంకటేష్

మద్దిపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆర్టీఐ యాక్ట్ కమీషన్ చావలి సునీల్ ఉత్తర్వుల మేరకు సమాచారం హక్కుచట్టం 2005 పై స్థానిక వ్యవసాయాధికారి సీహెచ్ వెంకటే ష్ శుక్రవారం అవగాహన కల్పించారు. మండల స్థాయి అధికారులు, గ్రామ స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఎంపాడు ఎంపీడీఓగా రంగ సుబ్బరాయుడు

హనుమంతునిపాడు: మండల అభివృ ద్ధి అధికారిగా ఎం.రంగసుబ్బారాయుడు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన నెల్లూరు జిల్లా నుంచి బదిలీపై రాగా ఇక్కడ పని చేస్తున్న ఎ.లలిత బాపట్ల జిల్లా చేబ్రోలు మండలం వెళ్లారు. ఇక్కడ జూనియర్ అసిస్టెంట్గా పని చేస్తున్న ఎస్. రఘురామ్ కుమార్ పీసీ పల్లి మండలం బిదిలీపై వెళ్లారు. పీసీ పల్లి పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ బ్రహ్మయ్య బదిలీపై వచ్చి విధుల్లో చేరారు. ఆయన్ను ఘనంగా సన్మానించి అభినందలు తెలిపారు. ఏఓ జీవీ. క్రిష్టారావు, ఈఓఆర్డీ షేక్ షరీఫ్, ఏపీఓ వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.


ఎంపీడీఓను సన్మానిస్తున్న సిబ్బంది

విద్యుత్ ఏఈగా సుబ్బారెడ్డి

మద్దిపూడి: మండల విద్యుత్ శాఖ ఏఈగా ఎదురు సుబ్బారెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కురిచేడు మండలం ఏఈ గా పని చేస్తూ బదిలీ పై మద్దిపూడి వచ్చినట్లు చెప్పారు. విద్యుత్ సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.


నూతనంగా బాధ్య పట్టిన ఏఈ సుబ్బారెడ్డి

ప్రత్యేక ప్రదేశాలు సందర్శించాలి

కందుకూరు రూరల్: ప్రతి విద్యార్థి ఏడాదికి ఒకసారైనా ఏదో ఒక ప్రత్యేకమైన ప్రాంతాన్ని సందర్శించాలని వైస్ ప్రిన్సిపాల్ ఏడుకొండల నరేంద్ర అన్నారు. స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పర్యటన చేసినప్పుడు ఆ ప్రాంతం విశేషాలను తెలుసుకోవాలన్నారు. ఆర్థిక అవకాశాలు మెరుగువడం వల్ల ప్రజల స్థితిగతులు కూడా కొంత మెరుగవుతాయన్నారు. చరిత్ర అధ్యాపకులు డి.రామాంజనేయులు మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి ప్రపంచ వ్యాప్తంగా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి, వారసత్వ కట్టడాలు, ప్రదేశాలను పరిరక్షించడానికి ఈ పర్యాటక దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాశాల ఆంగ్ల అధ్యాపకులు పి.రాజగోపాల్, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు కె.నరేష్ రాజా పాల్గొన్నారు.

ఉలవపాడు: స్థానిక జీవీఎస్ఎం జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యాటక దినోత్సవం గురించి ప్రిన్సిపాల్ జి.గోపిచంద్ ప్రకాష్ తెలియజేశారు. విద్యార్థులు ఏడాదిలో పర్యాటక ప్రాంతాలను పర్యటించాలన్నారు. పర్యటించిన ప్రాంతాలు పూర్తి సందర్శించి వాటి చరిత్రను తెలుసుకోవాలని చెప్పారు. స్వర్ణాంధ్రప్రదేశ్ పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అధ్యాపకులు రఫీ, గంగాభవాని, హనుమంతరావు, వెంకటేశ్వర్లు, మాధవరెడ్డి, మల్లికార్జున, శ్రీనివాసులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ ఏడుకొండల నరేంద్ర

ఘనంగా ఆరాధన మహోత్సవాలు


శివరామ బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

పామూరు: మండలంలోని అనుమునిగిరి శ్రీ శివ రామ బ్రహ్మేంద్రస్వామివారి 129వ ఆరాధన మహోత్సవాలు శుక్రవారం అనుమునిగిరి శివరామబ్రహ్మ క్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సఖ్యలో పాల్గొని తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ సమీపంలో మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నొస్సం నాగేంద్రాచారి, కేవీ రమణయ్య, గుత్తి రాజా, వి.ప్రసాదాచారి, శ్రీనివాసాచారి, దొరసానయ్యాచారి పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సబ్ రిజిస్ట్రార్

కనిగిరి రూరల్: కనిగిరి సబ్ రిజిస్ట్రార్గా ఎ. వాసుదేవ్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన చీమకుర్తి నుంచి బదిలీపై కనిగిరికి వచ్చారు. ఇప్పటి వరకు కనిగిరిలో సబ్రిజిస్ట్రార్గా విధులు నిర్వహించిన ఎ. గిరిజ మార్కాపురం సబ్రిజిస్ట్రార్గా వెళ్లారు.


వాసుదేవ్ రెడ్డి

రోడ్డుపై ఇలా.. వెళ్లేది ఎలా?

లింగసముద్రం: రాళ్లపాడు ప్రాజెక్టు నుంచి ఒకటిన్నర కిలోమీటరు దూరంలో ఉన్న రాళ్లపాడు కార్యాయం, అతిథి గృహానికి వెళ్ళే రోడ్డు చిల్లచెట్లతో మూసుకుపోయింది. ప్రాజెక్టు అధికారులు, రైతులు, ఇతర పనులపై వెళ్ళే ప్రజలు ఈ రహదారి వెంట వెళుతుంటారు. ఈ రోడ్డు తాతా హోటల్ నుంచి మొగిలిచర్ల వెళ్లే రోడ్డును కూడా కలుపుకుంటూ వెళుతుంది. అత్యవసర సమయాల్లో ప్రాజెక్టు అధికారులు ఈ రోడ్డు ఉపయోగిస్తుంటారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో చిల్లచెట్లతో రోడ్డు పూర్తిగా మూసుకుపోయింది. ప్రాజెక్టు నుంచి కార్యాలయం, అతిథి గృహానికి వెళ్ళాలంటే తాతా హోటల్ నుంచి వెళ్లాల్సి వస్తోంది.

ఉల్లాసంగా కళాజాత

కనిగిరి రూరల్: కళాజాత, గేయాల ద్వారా స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలకు అవగాన కల్పిండంతో ప్రజల్లో చైతన్యం కలుగుతుందని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. శుక్రవారం పట్టణంలో కళాజాత ప్రదర్శన కార్యక్రమాలు మున్సిపల్, మెప్మా, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో జరిగాయి. శానటరీ ఇన్స్పెక్టర్ నాయబ్ రసూల్, మలేరియా సబ్ యూనిట్ అధికారి రామాంజనేయులు, మెప్మా, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.


కళాజాత ప్రదర్శనను వీక్షిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

మధ్యాహ్న భోజనానికి విరాళం


దాతని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

టంగుటూరు: స్థానిక పోతుల చెంచయ్య మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సెప్టెంబర్ నెలకు గాను మధ్యాహ్న భోజన విరాళం అందింది. దివంగత రాజేంద్ర ప్రసాదు, సుబ్బరత్నం జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు మధ్యాహ్న భోజన నిమిత్తం రూ. 35,000 శుక్రవారం అందజేశారు. విద్యార్థులకు లడ్లు, అరటి పండ్లను అందించారు. చిడిపోతు వెంకటేశ్వర్లు, తొట్టింపూడి చక్రపాణి పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కందుకూరు: ఆధునిక ప్రపంచంలో యోగా ఆరోగ్యానికి చిరునామా అని హైదరాబాద్కు చెందిన ప్రముఖ యోగా శిక్షకుడు షణ్ముఖ శివచంద్ర అన్నారు. శుక్రవారం స్థానిక ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీలో మొదటి సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులకు నిర్వహించిన కార్యక్రమంలో యోగాపై శిక్షణ ఇచ్చారు. పోటీ ప్రపంచంలో ఏ వయస్సు వారికైనా ఒత్తిడిని జయించడానికి ఏకైక సాధన మార్గం యోగాయే అన్నారు. శరీర బాహ్యభాగాలను శుభ్రం చేసినట్లు అంతర్భాగాలను కూడా శుద్ధి చేయడం ద్వారా సర్వ వ్యాధులను నివారించవచ్చునని చెప్పారు.